తల్లిపాలను మించింది లేదు



చిల్పూరు: మాట్లాడుతున్న సీడీపీఓ ఫ్లోరెన్స్



జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్‌లో..

చిల్పూరు: బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలను మించింది లేదని స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీఓ ఫ్లోరెన్స్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ -1వ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్ గుర్రం నీనా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, ఎసెంసీ చైర్మన్ పంతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

జఫర్‌గఢ్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని హిమ్మత్‌నగర్ శివారు గువ్వలగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాటికాయల అశోక్ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు తప్పని సరిగా ముర్రుపాలు పట్టించాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ, వార్డు సభ్యురాలు పిట్టల నాగమ్మ, అంగన్‌వాడీ టీచర్ జరీనబేగం, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని అంగన్‌వాడీ టీచర్ దడిగే పద్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని గానుగుపహడ్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. టీచర్లు శ్రీదేవి, అరుణ, అనిత, మణెమ్మ, లక్ష్మి, రమ్య పాల్గొన్నారు.

చిన్నమడూరులో..

దేవరుప్పుల: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నమడూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ వంగ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, నర్మద, లలిత, ఆయాలు, ఐకేపీ వీఓఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న మిత్రుడికి చేయూత



భూదాన పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, పక్కన రాకేష్‌రెడ్డి

చిల్పూరు: అనారోగ్యంతో ఉన్న మిత్రుడి కుటుంబానికి కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి 5 గుంటల భూమి అందజేసి స్ఫూర్తిగా నిలిచారు. మండల పరిధి మల్కాపూర్ గ్రామానికి చెందిన కొత్తగట్టు అంబదాసు కొన్నేళ్లుగా అచేతన స్థితిలో ఉన్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న 2002 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి తన తండ్రి జగన్నాథరెడ్డి ఆదుకోవడానికి ముందుకువచ్చాడు. అందులో భాగంగా శనివారం డిప్యూటీ తహసీల్దార్ విమల ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సమక్షంలో భూయాజమాన్య హక్కు పత్రాన్ని రాకేష్‌రెడ్డి అంబదాసు-లావణ్య దంపతులకు అందజేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, మండల రైతు కోఆర్డినేటర్ యాదగిరి, పార్టీ అధ్యక్షుడు రమేష్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల చింతల్ బస్తీ ఎస్సీ కాలనీలోని సుమారు 50 ఇళ్ల వరకు కొన్ని రోజులుగా తాగునీరు రావడంలేదని శనివా రం రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశా రు. కాలనీకి నీళ్లు రావడంలేదని సర్పంచ్‌ను ప్రశ్నిస్తే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ విషయంపై సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డిని వివరణ కోరగా ఓవర్‌హెడ్ ట్యాంక్ మరమ్మతులో ఉండటంతో రెండు రోజులుగా పనులు చేస్తున్నారని, దీంతో కాలనీలోని కొన్ని ఇళ్లలోకి నీరు రావడంలేదని, ఒకటి రెండు రోజుల్లో వస్తాయని, కావాలని కొందరు రాద్ధాంతం చేస్తున్నారని వివరించారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

జనగామ రూరల్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్ జయంతిని పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం వక్రీకరణలు-వాస్తవాలు అనే పేరుతో తెలంగాణ ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. పాలనాధికారి సులేమాన్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రవిప్రసాద్, వెంకట్‌రెడ్డి, రాజేష్‌కుమార్, శైలజ, ఈశ్వర్, రవీంద్ర పాల్గొన్నారు.

అభ్యర్థిని మారిస్తే బరిలో ఉంటా..

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్



జనగామ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మారిస్తే బరిలో నిలిచేందుకు తాను సిద్ధమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు 2014లో ఎమ్మెల్సీ హోదాలో మా నాన్న, నేను చేరామని, రెన్యూవల్ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏ పదవీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల నుంచి ఏ పదవి ఇవ్వక పోయినా నాగపురి రాజలింగం వారసుడిగా రెండేళ్ల నుంచి నియోజకవర్గంలో అభాగ్యులకు అండగా నిలబడి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీసీ జనాభా ప్రాతిపదికన నిలిపితే తన కుటుంబానికి ఉన్న రాజకీయ అనుభవంతో పార్టీ ప్రతిష్టకు మరింత లాభం చేకూర్చేలా పాటుపడుతానని తెలిపారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్



మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

జనగామ రూరల్: దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని జనగామ ఆర్డీఓ మురళీకృష్ణ అన్నారు. నెహ్రూ యువకేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని జీప్స్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆర్డీఓ ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన దేశ ఆర్థికాభివృద్ధి యువత తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పేయింటింగ్, డ్రాయింగ్, ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు బైక్‌లు ఇవ్వాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న కొమురయ్య

రఘునాథపల్లి: భవన నిర్మాణ రంగాల కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి కార్మికుడికి ద్విచక్రవాహనం అందజేయాలని సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఎస్‌ఆర్‌కే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన సంఘం నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అర్హులైన కార్మికులకు లక్ష బైకులు ఇస్తామని ప్రకటించి ఏళ్లు గడిచినా ఇవ్వక పోవడం దారుణమన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ .5 వేల పింఛన్, ఈఎస్ఐ సౌకర్యం, రూ .15 లక్షల ఇన్సూరెన్స్, వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వాతాల యాదగిరి, మండల అధ్యక్ష, కార్యదర్శులు పసుల ఏలియా, పోకల శ్రీనివాస్, గొడిశాల ఐలేష్, కొమ్మగల్ల కృష్ణ, బొమ్మెర యాకయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

బచ్చన్నపేట: భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు జేరిపోతుల రాజు, నాయకులు అల్వాల ఎల్లయ్య, అబ్బసాయిలు, కిష్టయ్య, పుల్లయ్య, రాజు, రాజ్‌కుమార్, మురళి, సత్తయ్య, రమేష్, మనోహర్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలి

దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి: 2014 నుంచి 2023 వరకు రైతులు తీసుకున్న రుణాల మొత్తానికి ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి, జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ సునావత్ సుమన్, రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ కూస భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వేర్వేరుగా ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన రుణమాఫీ హామీని ఎన్నికల స్టంట్‌గా అమలు చేయడాన్ని రైతులు గమనిస్తున్నారని, ఎనిమిదేళ్లుగా తీసుకున్న అప్పుకు రైతులు బ్యాంకర్లకు వడ్డీలు చెల్లించి నష్టపోయారన్నారు. అన్నదాతలపై చిత్తశుద్ధి ఉంటే నేటి వరకు బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



జఫర్‌గఢ్: ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన బాధిత కుటుంబాలకు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పంపిన ఆర్థికసాయం శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్ అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన దామెర నరేష్ అనారోగ్యంతో, అందె బయ్యన్న గుండెపోటుతో మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు భాదిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

పరామర్శ

మండలంలోని రేగుల తండాకు చెందిన బాలునాయక్, హక్యతండాకు చెందిన రామనర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, శనివారం బాధిత కుటుంబాలను మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

స్నేహితుడి కుటుంబానికి..

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన ఎండి మజహర్ ఇటీవల మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న 1990-91 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుమార్తె పేరుపై రూ.35వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు.

బియ్యం అందజేత

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురంలో గంగుల నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని బీజేవైఎం, బీజేపీ నాయకులు పరామర్శించి 75 కిలోల బియ్యాన్ని అందజేశారు.

'హామీలకే పరిమితం'



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల హామీలకే అభివృద్ధి పనులు పరిమితమై పోయాయని వరంగల్ జిల్లా పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, లెదర్ పార్కు, మినీ స్టేడియం మంజూరు చేశామంటూ పాలాభిషేకాలు, కోలాటాలు చేశారే తప్ప అవి నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. నాయకులు మేకల మల్లేషం, కోల శ్రీనివాస్, పోలేపల్లి సంపత్ రెడ్డి, నీల రాము, పొన్న శేఖర్, కుంభం ఉపేందర్, జంపాల శ్రీనివాస్, రఘు, గుర్రం సోమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సమ్మయ్య, గట్టయ్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాల ఆవరణ చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలోకి పందులు, కుక్కలు వచ్చి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని, మురుగు కాలవ్వతో కంపు కొడుతున్నదని, ఈగలు, దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు వ్యాధులబారిన పడే అవకాశం ఉందన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని విద్యార్థుల ఆరోగ్యం, చదువే మన లక్ష్యమన్నారు.

జీవాలకు టీకాలు తప్పని సరిగా వేయించాలి

జనగామ రూరల్: జీవాలు ఆరోగ్యంగా ఉండటానికి టీకాలు తప్పని సరిగా వేయించాలని పెంబర్తి సర్పంచ్ అంబాల ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంబర్తిలో పశువులకు గాలికుంటు, లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విజయ డెయిరీ చైర్మన్ సంపత్, డాక్టర్ శ్రీకాంత్ జేవీఓ హఫీజ్, శ్రీనివాస్,రాజయ్యలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



గుంతలు పూడ్చి వేయిస్తున్న ప్రజాప్రతినిధులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ నుంచి ఫతేషాపూర్ వెళ్లే రెండు కిలోమీటర్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్ద పెద్ద గోతులను స్థానిక ప్రజాప్రతినిధులు సొంత డబ్బులతో పూడ్చి వేసి ఔదార్యం చాటారు. ఈ రహదారిలో వాహనాలపై వెళ్తున్న వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును బాగు చేయాలని ఫతేషాపూర్ సర్పంచ్ ఎండీ హయతలీ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్, వార్డు సభ్యులు నామాల నాగరాజు, గడ్డం మధు, జిల్లా నర్సింహులు సంబంధిత అధికారుల దిష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను చూసిన వారు రోడ్డు మరమ్మతుకు ముందుకు వచ్చారు. రెండు రోజులుగా సొంత డబ్బులతో ట్రాక్టర్ల ద్వారా గుంతల్లో మొరం పోయించి పూడ్చి వేశారు. ఈ రహదారిపై ప్రయాణించే ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్ గ్రామస్తులు.. ప్రజాప్రతినిధుల సేవా దృక్పథాన్ని గుర్తించి అభినందించారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ప్రవీణ్

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని, కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందాయని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింగారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళిత, బీసీ బంధు పథకాలను వారి కార్యకర్తలకు మాత్రమే చేతివాటం చూపి ఇచ్చారని తెలిపారు. ఈ బంధు పథకాలపై ప్రభుత్వం సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. జిల్లా వైస్ చైర్మన్ చెరుకూరి శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి అంజిగౌడ్, నాయకులు వంచ వెంకట్‌రెడ్డి, నిడిగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పాలకుర్తి: మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా వైస్ చైర్మన్ చెరుకూరి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు.

31వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె

తరిగొప్పుల: జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 31వ రోజుకు చేరుకుంది .ఈ సందర్భంగా జీపీ కార్మికులపై ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.

అక్రమ అరెస్టులతో పోరాటం ఆగదు

పాలకుర్తి: కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం వల్ల పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గీత కార్మిక సంఘం భవనలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు రమేష్,రాపర్తి సోమయ్య ఉన్నారు.

అణచివేత తగదు

దేవరుప్పుల: అసంఘటిత కార్మికుల ఉద్యమాలను పాలకవర్గాలు అణిచివేసే కుట్రలు తగవని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు. శనివారం కార్మికుల దీక్ష వద్ద ఆయన మాట్లాడారు.

జీపీ కార్మికుల విడుదల

పాలకుర్తి మహాధర్నాకు తరలివచ్చిన జిల్లాలోని పలు మండలాల జీపీ కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం నాటికీ విడుదల చేయకపోవడం పై తీవ్రచర్చనీయంశంగా మారింది. పాలకుర్తితోపాటు ఆయా మండలాల్లో ముందస్తు అరెస్టుకు గురైన జీపీ కార్మిక సంఘాల నాయకులను సొంత పూచీకతుపై విడుదల చేయగా కేవలం దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో 14 మందిని ప్రత్యేకించి అదుపులోనే ఉంచుకోవడంతోపాటు బైండోవర్ చేసే చర్యలను నిరసించారు. కార్మిక సంఘాల నేతల పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడడంతో ఎట్టకేలకు సాయంత్రం విడుదలచేయడం గమనార్హం.

రెండో రోజూ పోలీసు కస్టడీలోనే

నర్మెట: డిమాండ్ల సాధనకోసం గ్రామపంచాయతీ సిబ్బంది తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారం 30వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించక పోవడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి క్యాంపు కార్యాలయ ముట్టడికి సిబ్బంది పిలుపునివ్వడంతో ముందస్తు చర్యగా శనివారం సైతం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

విరాళం

నర్మెట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని అమ్మాపురం ఉన్నతపాఠశాల పైకప్పు కూలిపోయింది. పూర్వవిద్యార్థుల ద్వారా విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ శనివారం పాఠశాలను సందర్శించి మరమ్మతుకు రూ. 5 వేలు అందజేశారు. గడ్డం వినోద్, కరుణాకర్, వినోద్, రాజు, అజయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిల్పూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎంతో కృషిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం మండల శాఖ అధ్యక్షుడు దాసి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న భోజన కార్మికులకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు శనివారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గత కొన్నేళ్ల నుంచి భోజన కార్మికులుగా పని చేస్తున్న చాగంటి స్వప్న, రజిత, సరితలకు చీరలను అందజేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు సాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బాధ్యులు

చిల్పూరు: నప్కల్‌కు చెందిన ఫిలోక్సనియా గ్లాస్పెల్ సొసైటీ బాధ్యులు పాస్టర్ కిష్టఫర్ ఆధ్వర్యంలో శనివారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్‌లో వరద బాధితులకు నిత్యావసరాలు, భోజన ప్యాకెట్లు, దుస్తులు అందజేశారు. స్థానిక సర్పంచ్ సార్ల సమ్మయ్య, ఎంపీటీసీ పాశం శిరీష-సురేష్, శాగంటి మణి-శృతి, పాశం అరుణ-ఆదాం, సభ్యులుగం గారపు ఈశ్వర, రజిత, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



జనగామ రూరల్: అమృత్ భారత్ పథకంలో భాగంగా జనగామ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులకు ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సందర్భంగా శనివారం స్టేషన్ వద్ద మోదీ చిత్రపటానికి బీజేపీ కౌన్సిలర్ మహంకాళీ హరిశ్చంద్ర గుప్త అధ్యక్షతన క్షీరాభిషేకం చేశారు. స్టేషన్ రెండు వైపులా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్, ల్యాండ్ స్కేప్‌తో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారని జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి తెలిపారు.

నేడు ఘన్‌పూర్‌కు మంద కృష్ణమాదిగ రాక

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని కేఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నేడు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌లు మడిమల్లి శ్యాం, బుంజూరు విజయ్ తెలిపారు. ఘన్‌పూర్‌లో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం సంఘం జిల్లా కోకన్వీనర్ బొట్ల మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు.

కనిపించకుండా పోయిన బాలికల ఆచూకీ లభ్యం

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులోని హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోగా వారి ఆచూకీ రాత్రి లభించింది. కలకలం రేపిన ఘటన అంతలోనే సమసిపోయింది. ఎస్సై అరుణ్, హెచ్‌ఎం వలబోజు కృష్ణమూర్తి కథనం ప్రకారం.. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బాలికలు కనిపించకుండా పోయిన విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే వారి ఆచూకీ లభించకపోవడంతో సాయంత్రం 4.30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురు బాలికలు వారిలోని ఓ బాలిక అమ్మమ్మ నివాసం ఉండే సిద్దిపేట జిల్లాలోని వీరారెడ్డిపల్లికి చేరుకున్నట్టు రాత్రి 8 గంటల సమయంలో గుర్తించారు. దీంతో బాలికలు కనిపించకుండా పోయారన్న కలకలం సద్దుమణిగింది. బాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై వృద్ధురాలు

రఘునాథపల్లి: స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై అచేతన స్థితిలో పడిఉన్న సుమారు 75 ఏళ్ల వయసు ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలిని జనగామ 'సఖి' నిర్వాహకులు చేరదీసి వృద్ధాశ్రమానికి తరలించారు. మొదట డీడబ్ల్యూఓ ద్వారా సమాచారం అందుకున్న సఖి టీం వృద్ధురాలి వద్దకు చేరుకుని సపర్యలు చేసి వాహనంలో రాజేశ్వరి వృద్ధాశ్రమానికి తీసుకెళ్లి చేర్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాధిక, సెక్యూరిటీ గార్డ్ సంధ్యారాణి, సిబ్బందిని సఖి ఓఎస్‌సీ రేణుక అభినందించారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

రఘునాథపల్లి: మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ పి.యుగేందర్‌ను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకే అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. సర్పంచ్ శివకుమార్, రమేష్, బుచ్చయ్య, విజయ్ ఉన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి

దేవరుప్పుల: ఉద్యోగ, ఉపాధ్యాయుల మనుగడకు విఘాతం కలిగించే నూతన పెన్షన్ విధానం సత్వరమే రద్దు చేయాలని యూఎస్‌పీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో 12వ తేదీన జనగామలో తలపెట్టిన ర్యాలీ, ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

శతాధిక వృద్ధుడి మృతి



కాలియా చంద్రయ్య(ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామంలో నివాసముంటున్న శతాధిక వృద్ధుడు కాలియా చంద్రయ్య (101) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య గంగవ్వ, ఎనమిది మంది కూతుళ్లు, నలుగురు కుమారులు, మనుమలు, మనవరాళ్లు ఉన్నారు. మృతుడి కుమారుడు కాలియా చిట్టిబాబు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా, నక్కల పిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఎంపీపీ నాగజ్యోతి, సర్పంచ్ స్వామి పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.